# ఒక గేదె కథ

అనగా అనగా ఒక వూళ్ళో ఒక గేదె.

నల్లగా, నిగనిగలాడుతూ గేదెలాగ అందంగా రోడ్డుమీద అడ్డంగా నడిచి వెళ్తుంటే చూడముచ్చట వేసి ట్రాఫిక్ పోలీసు గుడ్లప్పగించి వుండిపోయాడు.

గేదె విలాసంగా పేడ వేస్తూ మోడరన్ ఆర్ట్‌లాగ రోడ్డుమీద వుచ్చ పోస్తూ చివరి దాకా వెళ్ళేవరకూ రెండు లారీలు, మూడు బస్సులు, నాలుగు కార్లు, ఐదు రిక్షాలు, పదిహేను సైకిళ్ళు ఆగిపోయాయి. సిటీ బస్సుల వాళ్ళు కూడా గేదెని కాదని వెళ్ళలేక ఆగిపోయారు. రోడ్డు చివరికి వెళ్ళిన గేదె ఒక్కసారి వెనక్కి తిరిగి, ఆగిపోయిన ట్రాఫిక్‌ని, ట్రాఫిక్ పోలీసుని చూసి చిర్నవ్వునవ్వి మరొక్కసారి పేడ వేసి సదరు పట్టణంలో రోడ్లపైన, ట్రాఫిక్ పైన మునిసిపాల్టీ పైన తన అభిప్రాయాన్ని తద్వారా తెలియచేసి పక్కవీధిలోకి వెళ్ళిపోయింది.

గేదెల్లో అభిమాన సంఘాలు లేవు కాబట్టి వీలైనన్ని సినిమా వాల్ పోస్టర్లని సమానంగా ఆరగించడానికి సదరు గేదె మెడ ఎత్తి గోడ మీదకి నాలిక చాచి అర్ధనగ్నంగా వున్న ఒకానొక సినిమా తారని తినబోయింది. ఆ గేదెని, ఆ సొగసుని, ఆ ఠీవిని గుర్తుపట్టిన శ్రీమతి సింహాచలం "దొరికింది నా గేదె! దొరికింది" అని ఎగిరి గంతేసి గేదెని ప్రేమగా కౌగలించుకున్నంత పనిచేసింది.

వెనకాల గడ్డికట్ట పట్టుకొస్తున్న శ్రీమతి పైడితల్లి "ఇదేటి ఇచిత్రం! నా గేదెని పట్టుకుని నువ్వు ముద్దులాడేస్తున్నావ్"అని ఆశ్చర్యపోయింది.

"ఈ గేదె నాది! రెండెన్నెల్లక్రితం తప్పిపోయింది"అని శ్రీమతి సింహాచలం కళ్ళనీళ్ళు తుడుచుకుంది.

"తప్పిపోయి మళ్ళీ నీకే దొరకడానికి ఇదేటి తెలుగు సినిమా అనుకుంటున్నావేటి? ఎల్లెల్లు ఈ గేదె నాది. ఆర్నెల్ల క్రితం కంట్రాక్టర్ అమ్మగారి దగ్గర కొన్నాను. కావాలంటే ఎల్లడుగు. ముందు గేదె నొదులు" అని తారక స్థాయిలో శ్రీమతి పైడితల్లి అభినయిస్తూ శ్రీమతి సింహాచలానికి తెలియచేసింది.

"నాకు బాగా గుర్తు-ఇదే నా గేదె! ఇదే రంగు, ఇవే చెవులు, ఇవే కొమ్ములు, ఇవే కళ్ళు! ఇదే నా గేదె! తప్పిపోయిన నా గేదెని నువ్వే కట్టేసుకున్నావు" అని శ్రీమతి సింహాచలం పైస్థాయిలో తిరగబడింది.

మాటా మాటా దాటి వ్యవహారం జుట్టూ జుట్టూ పట్టుకునే వరకూ వచ్చే సరికి అమాయకురాలైన ఆ గేదె విస్తుబోయింది. టిక్కెట్టు లేకుండా కాలక్షేపం జరుగు

## స్వగతంబు

తుందికదా అని వెంటనే ప్రజలు వీలైనంత మంది గుమిగూడారు.

గేదె సింహాచలంకి చెందాలని కొందరు, పైడితల్లిదేనని మరికొందరు అభిప్రాయపడసాగారు. "మా మూలు ఇవ్వకుండా మోళీ ఎవరు ఆడుతున్నారు చెప్మా" అనుకుంటూ ఇందాకటి ట్రాఫిక్



పోలీసు పరిగెట్టుకుంటూ వచ్చాడు. తీరా చూసేసరికి ముందు అతనికి ఆశ్చర్యం, ఆటు పిమ్మట ఆగ్రహం కల్గాయి.

"ఇద్దరూ నోర్మూసుకుని గేదె నట్టుకొని స్టేషన్‌కి రండి. గేదె ఎవళ్ళదో అక్కడ తేల్తుంది" అని గర్జించి గేదెతో సహా ఇద్దర్నీ స్టేషన్‌కి తోలుకుపోయాడు.

"ఇది మామూలు గేదె కాదు, ఇది మామూలు వ్యవహారం కాదు. రోడ్డు మీద అడ్డంగా గేదెని తోలుకెళ్ళడం ట్రాఫిక్ కేసు. తప్పిపోయిన గేదెను కట్టేసుకోడం క్రైమ్ కేస్. గేదె కోసం ఇద్దరూ కొప్పు లట్టుకుని కొట్టుకోడం లా అండ్ ఆర్డర్ కేసు. అయినా ఆడాళ్ళ మీద ఇన్ని కేసులు ఎందుకని వొగ్గేస్తున్నాను. గేదెని వొగ్గేసి ఇద్దరూ మాట్లాడక ఎల్లిపోండి. గేదె పూసెత్తితే మూడు కేసులు మీ మీద కబెయ్యాల్సొస్తుంది" అన్నాడు పోలీసు అప్పలస్వామి స్టేషన్‌కి వెళ్ళాక.

"ఓలమ్మో నా గేదె, నా గేదె" అని శ్రీమతి సింహాచలం మరియు శ్రీమతి పైడితల్లి విడివిడిగానూ, ముక్తకంఠంతోనూ విచారించారు. ఎంత విచారించినా లాభం లేకపోయింది.

"ఈ గేదె మీ ఇద్దరిదీ కాదు. మొన్ననే మాకు కంప్లెయింటు ఇచ్చిన నూకాలమ్మది ఈ గేదె. ఇదే రంగు, ఇవే కొమ్ములు. ఇవే కళ్ళు! ఇదే గేదె! మర్యాదగా గేదెని నూకాలమ్మకి ఒగ్గేసి ఎల్లండి. లేపోతే కటకటాల వెనక్కి ఎల్తారు" అన్నాడు పోలీసు అప్పలస్వామి కళ్ళెర్రచేసి.

"గేదెమాట దేముడెరుగు, పోలీసుకేసులెందుకు దేవుడా!" అనుకుంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుని సింహాచలం, పైడితల్లి ఐకమత్యంతో వెళ్ళిపోయారు.

నూకాలమ్మ వయ్యారంగా వచ్చి అప్పలస్వామికేసి క్రీగంట చూసింది. అప్పలస్వామి మీసాలు తిప్పుతూ చిరునవ్వు నవ్వి "అదుగో నీ గేదె తోలుకెళ్ళు" అన్నాడు.

"మంచి వాటంగా వుంది మామా! ఇంతకీ ఎవరిదీ గేదె" అని అప్పలస్వామి రెండోభార్య నూకాలమ్మ ప్రేమగా అప్పలస్వామిని అడిగింది.

"ఈ గేదె నాది. గేదెకాదు ఆ మీసాలోడు నావోడే!" అంటూ అప్పలస్వామి అసలు భార్య అచ్చియమ్మ వచ్చి ఒక చేత్తో గేదెని మరో చేత్తో అప్పలస్వామినీ లాక్కుపోయింది. గేదె అప్పలస్వామి ఇంటికి, కథ కంచికీ వెళ్ళిపోయాయి.

[నీతి :-మనుష్యుల్లోనే రకరకాల వాళ్ళు వుంటారు. గేదెలు మాత్రం అన్నీ ఒక్కలాగే వుంటాయి.]

—తంబు

